క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మక్తల్: మండలంలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, సర్పంచ్ పెద్దలక్ష్మి, కార్యదర్శి మౌనిక పాల్గొన్నారు.

పూజారులకు దుస్తుల పంపిణీ

కోస్గి: పట్టణంలో ఊరడమ్మ బోనాల పండుగ సందర్భంగా ఆలయ పూజారులుగా వ్యవహరించే ఊరడి కుటుంబాలకు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మ్యాకల శిరీష దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాజేశ్, వెంకట్‌నర్సింహులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



మరికల్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతోపాటు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కేంద్రాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు ఉత్తమ సేవా పతకం



ధన్వాడ: మండలంలోని కొండాపూర్‌కు చెందిన కానిస్టేబుల్ బాలరాజుగౌడ్ పోలీస్ ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు బాలరాజుగౌడ్ తెలిపారు. పోలీస్ ఉద్యోగంలో చేరిన నాటి నుంచి అనేక సామాజిక కార్యక్రమాలతోపాటు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడంతో ఉత్తమ సేవా పతకం వరించినట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఊరడమ్మ బోనాలు

కోస్గి: పట్టణంలో బుధవారం ఊరడమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీలకు చెందిన మహిళలు బోనాలతో ఊరడమ్మ ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నిరసన హోరు



జిల్లావ్యాప్తంగా పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం కొనసాగింది. తమ సమస్యలను పరిష్కరించాలని ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేశారు. మక్తల్, మద్దూర్ మండల కేంద్రాల్లో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. కోస్గి, మంగనూర్‌లో అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించారు. కృష్ణాలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట వంటావార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఊట్కూరులో ధర్నా నిర్వహించారు. కార్మికుల సమ్మెకు పలు సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

రూ.2.50లక్షల చెక్కు అందజేత

ఆత్మకూర్: బాలకిష్టాపూర్‌కు చెందిన అమ్రియానాయక్ కుమారుడు జనియనాయక్ కిడ్నీ సంబంధిత వ్యాధితో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి రూ.లక్షల్లో ఖర్చు అవుతుండడంతో విషయం తెలుసుకున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావ్‌తో మాట్లాడి రూ.2.50లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించి బుధవారం బాధిత కుటుంబానికి అందించారు.

వ్యక్తికి గాయాలు

దామరగిద్ద: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని ఉల్లిగుండం గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని విఠలాపూర్‌కు చెందిన గుట్టలి వెంకటేష్ కారులో గుర్మిట్కల్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా, ఉల్లిగుండం సమీపంలో కుడిచేతిని బయట పెట్టగా, వెనుకలే వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అరచేతి భాగం తెగి రోడ్డుపై పడింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానికులు గుర్మిట్కల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వెంకటేష్ ఫిర్యాదు మేరకు ముదెల్లి పోలీస్‌స్టేషన్‌లో లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసే కుట్ర

- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలి
- జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన
- దిష్టిబొమ్మల దహనం



మక్తల్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మక్తల్: ప్రభుత్వం వ్యవసాయానికి అందిస్తున్న 24గంటల ఉచిత విద్యుత్‌ను కాంగ్రెస్ పార్టీ ఎత్తివేసే కుట్రలకు పాల్పడుతున్నదని బీఆర్‌ఎస్ నాయకులు ధ్వజమెత్తారు. ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. మక్తల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతులపై కక్ష కడితే పుట్టగతులు లేకుండాపోతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అమరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు మొగులప్ప, శంషొద్దీన్, మధు, రాములు, శివారెడ్డి, బండారి ఆనంద్, కృష్ణయ్యయాదవ్, అనిల్ , వెంకటేష్ పాల్గొన్నారు.

కోస్గి: దేశానికి అన్నం పెట్టే రైతులను విస్మరిస్తే పుట్టగతులు ఉండవని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరా విషయంలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్థానిక శివాజీ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మ్యాకల రాజేశ్, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, వైస్‌చైర్మన్ వేణుగోపాల్, ఎంపీపీ మధుకర్‌రావు, వెంకట్ నర్సింహులు, బుగ్గప్ప, రామకృష్ణారెడ్డి, హన్మంతు, శంకరయ్య, పోశప్ప పాల్గొన్నారు.

మద్దూరు: రైతులకు 3గంటల విద్యుత్ సరఫరా చేస్తే సరిపోతుందని రేవంత్‌రెడ్డి మాట్లాడడంపై మద్దూరు, కొత్తపల్లి మండల కేంద్రాల్లో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేసి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులు బాగుపడుతుంటే ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. టీపీసీసీ అధ్యక్షుడు రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, ఏఎంసీ చైర్మన్ వీరారెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, వీరేష్‌గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, మహేందర్, రామకృష్ణ, చంద్రశేఖర్, విఠల్, పీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను చూసి ఓర్వలేక లేనిపోని విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి, జెడ్పీటీసీ అశోక్‌కుమార్‌గౌడ్, సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, విజయసింహారెడ్డి, శివరామరాజు, శమీ, గంగప్ప పాల్గొన్నారు.



మద్దూరులో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



కోస్గిలో..

విద్యారంగంపై నిర్లక్ష్యం చేయొద్దు



మక్తల్‌లో రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నారాయణపేట రూరల్: విద్యారంగ సమస్యల సాధనకు బుధవారం పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ సంయుక్తంగా విద్యాసంస్థల బంద్ చేపట్టారు. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించగా, ప్రభుత్వ విద్యాసంస్థల తరగతులను ఆయా సంఘాల నాయకులు బహిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నదని, కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తూ పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గణేశ్, కృష్ణ, సాయిరాం, వెంకటేశ్, అరుణ్, జగదీశ్, అంజి, శశి, కిరణ్ పాల్గొన్నారు.

మక్తల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. మక్తల్ పట్టణంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యాసంస్థలను బంద్ చేయించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈశ్వర్, అజయ్, సంధ్య, రఘు, తిరుపతి, ప్రకాశ్, రమేశ్, సాకేత్, శేఖర్ పాల్గొన్నారు.

మాగనూర్: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు చిన్ననర్సింహ అన్నారు. కార్యక్రమంలో సాకేత్, నరేశ్, రమేశ్, సూర్యప్రకాశ్, అజయ్ పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలో వామపక్ష విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ చేపట్టినట్లు పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీహరి తెలిపారు. కార్యక్రమంలో విజయ్, మల్లేశ్, అశోక్‌బాబు, అంజి, లాలు, కాశీ, రాజు ఉన్నారు.

దామరగిద్ద: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మోహన్, పీడీఎస్‌యూ మండల కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని దామరగిద్ద, కాన్‌కుర్తి, విఠలాపూర్, మొగుల్‌మడ్క తదితర గ్రామాల్లో పాఠశాలల తరగతులను బహిష్కరించారు. కార్యక్రమంలో నవీన్‌గౌడ్, శ్రీకాంత్, అనిల్, రాజుకుమార్, మహమూద్, సత్తి, భీమేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ధన్వాడ: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీడీయూఎస్ జిల్లా కార్యదర్శి బాలు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ధన్వాడలో విద్యాసంస్థలను బంద్ చేయించారు.

బాలకార్మికులకు విముక్తి

నారాయణపేట రూరల్ : ఆపరేషన్ ముస్కాన్–9 బృందం సోమవారం జిల్లాలోని పలు మండలాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించింది. మరికల్, ధన్వాడ మండలాల్లోని హోటళ్లు, కిరాణ దుకాణాలు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు తదితర చోట్ల పనులు చేస్తున్న 8మంది బాలకార్మికులను గుర్తించి సీడబ్ల్యూసీ కార్యాలయంలో అప్పగించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట వారిని హాజరుపరిచి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పిల్లలను పనుల్లో పెట్టుకున్న వారికి జరిమానా విధించనున్నట్లు పేర్కొన్నారు.

గోవా మద్యం పట్టివేత

కృష్ణా: మండల సరిహద్దులోని ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాల తనిఖీ చేపట్టగా, 8 బాటిళ్ల గోవా మద్యం లభించిందని ఎక్సైజ్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మద్యాన్ని తీసుకొచ్చిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వాహనాల తనిఖీలో సిబ్బంది మల్లన్నగౌడ్, సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మాగనూర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు కళాబృందం సభ్యుడు సురేందర్‌గౌడ్ సూచించారు. మండలంలోని పెగడబండలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫోన్‌లో సంప్రదించే అపరిచిత వ్యక్తుల మాటలను నమ్మవద్దని తెలిపారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు కళాకారులు శేఖర్, లింగన్న, కల్యాణి, హెడ్‌కానిస్టేబుల్ ఉమేశ్‌గౌడ్, రమేశ్‌రావు పాల్గొన్నారు.



మెహందీ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

ఘనంగా మెహందీ వేడుక

మక్తల్: ఆషాడమాసం సందర్భంగా బుధవారం పట్టణంలోని వాసవీమాత, నల్లజానమ్మ ఆలయాల్లో భవసార్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో మెహందీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నౌలే రంజన, విజయలక్ష్మి, అనసూయ, నీంకర్, మాధురి, లక్ష్మి, లక్ష్మీబాయి, విజయ్ పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచుతున్న ప్రభుత్వం

- కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలు దహనం



మద్దూరులో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మద్దూరు: వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని గొప్పలు చెబుతున్న కేసీఆర్ ప్రభుత్వం.. వాస్తవంగా 12గంటలు కూడా సరఫరా చేయకుండా రైతులను నట్టేట ముంచుతున్నదని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. టీపీసీసీ ఆదేశాల మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మద్దూరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ సబ్‌స్టేషన్‌కు వెళ్లినా రోజుకు కనీసం 12గంటలు కూడా రైతులకు సరఫరా చేయడంలేదన్నారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించి అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. విద్యుత్ సంస్థలను రూ.60వేల కోట్ల అప్పుల్లో ముంచిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. అనంతరం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ వెంకట్‌రెడ్డి, శివరాజ్, మహేందర్‌రెడ్డి, మల్లికార్జున్, బాలరాజు, చంద్రమోహన్, రహీం, జనార్దన్, బాబుస్వామి, మహిపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరించడం తగదన్నారు. అవినీతి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఆనంద్, బస్వరాజ్, మౌలాలి, వెంకటయ్యగౌడ్, మారెప్ప, భీమప్ప, కృష్ణయ్య, నర్సింహ, రామ్, కిష్టారెడ్డి, రవి, తాయప్ప పాల్గొన్నారు.

మరికల్: మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి 24గంటల కరెంట్ పేరుతో ప్రైవేట్ కంపెనీలకు అమ్ముకుంటుందన్ని ఆరోపించారు. కార్యక్రమంలో హరీశ్, అంజిరెడ్డి, చెన్నారెడ్డి, రవి, నాగరాజు, రఘు, రాజు, మల్లేశ్ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు యఘ్నేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు 24గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకుండా కోతలు విధించడం సరికాదన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు లింగం, వల్లంపల్లి నారాయణ, రమేశ్, అనీల్, విజయ్, హన్మంతు పాల్గొన్నారు.



మాగనూర్‌లో..



మరికల్‌లో..

సమస్యల పరిష్కారానికి కృషి



డ్రెయినేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ

నారాయణపేట టౌన్ : మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ చెప్పారు. పట్టణంలోని ఏడోవార్డు గాయత్రినగర్, బాబాకాలనీ, అశోక్‌నగర్, లింగప్పతాతగుట్ట ప్రాంతాల్లో బుధవారం మున్సిపల్ కమిషనర్ సునీత, కౌన్సిలర్ ఎండీ సలీంతో కలిసి పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. వార్డులో సీసీరోడ్డు, డ్రెయినేజీలు పూర్తిస్థాయిలో లేక అవస్థలు పడుతున్నామని కాలనీవాసులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. ఆమె స్పందిస్తూ.. అవసరమైన చోట డ్రెయినేజీలు, సీసీరోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వార్డులో నెలకొన్న సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గందె చంద్రకాంత్, చెన్నారెడ్డి, రఘు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే మెరుగైన విద్య



విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటయ్య

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నట్లు జెడ్పీటీసీ వెంకటయ్య అన్నారు. మండలంలోని గురువలింగంపల్లి ప్రాథమిక పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి మెరుగైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపి అప్పులపాలు కావొద్దని సూచించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాల్‌రాం, హన్మంతు, వెంకటయ్యగౌడ్ , సాయిబన్న పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి



ఉపాధ్యాయులకు మెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓ

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఇంచార్జీ ఎంఈఓ వెంకటయ్య అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో బుధవారం ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు వెలుగు మెటీరియల్, వర్క్ షీట్, జాలి ఫోనిక్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులను ఎప్పటికప్పుడు సరి చేసుకుంటూ వినూత్న రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. ఎవరైనా విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మాగనూర్, నేరడగం కాంప్లెక్స్ హెచ్‌ఎంలు నర్సింహులు, వెంకటయ్య, సీఆర్పీలు ఎల్లాగౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

పండుగ సాయన్న విగ్రహం ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

మక్తల్: పట్టణంలో పండుగ సాయన్న విగ్రహం ఏర్పాటు చేయాలని నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నాయకులు మామిళ్ల పృథ్వీరాజ్, నవీన్‌కుమార్, కార్తీక్ కోరారు. మక్తల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణతో పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటు పనులను మధ్యలోనే ఆపేశారని తెలిపారు. సాయన్న జయంతి రోజు నాటికి విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు అందరూ సహకరించాలని కోరారు.

పద్మశాలీలను ఆదుకోవాలి



ఊట్కూరులో సభ్యత్వం చేయిస్తున్న నాయకులు

ఊట్కూరు: ప్రభుత్వం పద్మశాలీలను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ పద్మశాలి సంఘం జిల్లా నాయకుడు శివాజీ కోరారు. మండల కేంద్రంలో బుధవారం పద్మశాలి సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పద్మశాలీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబంధు పథకం తరహాలో చేనేతబంధును ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం కులవృత్తులకు అందిస్తున్న ఆర్థిక సహాయంలో పద్మశాలీలకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమీనన్, మనోహర్, శ్యాంరావు, లక్ష్మీనారాయణ, ఆనంద్, రేణుక, శ్రీదేవి పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం



బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభిస్తున్న నాయకులు

ఊట్కూరు: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును బుధవారం సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్నేళ్లుగా మూతపడి ఉన్న లక్ష్మి థియేటర్‌లో యజమాని కిశోర్‌గౌడ్ సొంత ఖర్చులతో షటిల్ బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, బ్యాంక్ క్యాషియర్ రమేశ్, వార్డు సభ్యుడు అశోక్, తరుణ్, భరత్, మహేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

విధినిర్వహణపై నిర్లక్ష్యం



మధ్యాహ్నమే తాళం వేసి ఉన్న కొత్తపల్లి పాఠశాల

మాగనూర్: మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు విధినిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విద్యారంగ సమస్యలపై వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం పాఠశాలలను బంద్ చేయించారు. అయితే విద్యాశాఖ నిబంధనల మేరకు విద్యార్థులను ఇంటికి పంపించినా ఉపాధ్యాయులు మాత్రం పాఠశాలలోనే పూర్తి సమయం వరకు ఉండాలనే నిబంధన ఉంది. అయితే కొత్తపల్లి, మందిపల్లి, వడ్వాట్ పీఎస్‌ల ఉపాధ్యాయులు మధ్యాహ్నం సమయంలోపే పాఠశాలలకు తాళం వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ విషయంపై ఎంఈఓను వివరణ కోరగా.. మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంల సమావేశం ఉన్నందున వారందరూ ఎంఆర్సీ కార్యాలయానికి వచ్చారని, మిగతా ఉపాధ్యాయులు పూర్తి సమయం వరకు పాఠశాలలోనే ఉండాలన్నారు. సమయం కాకముందే పాఠశాలలకు తాళ్లాలు వేసి వెళ్లిన వారిపై విచారణ జరిపి మెమోలు జారీ చేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా కొత్తపల్లి పాఠశాలలో ప్రార్థన సమయంలో ఉండాల్సిన ఉపాధ్యాయులు రోజూ ఆలస్యంగా వస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు.

గ్రామాభివృద్ధికి సహకరించాలి

మరికల్: గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని ఉపసర్పంచ్ శివకుమార్ కోరారు. మరికల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వార్డు సభ్యుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో పార్టీలకు అతీతంగా భాగస్వాములు కావాలన్నారు. ప్రస్తుతం కార్మికులు సమ్మెలో ఉన్నారని, గ్రామంలో పారిశుధ్యం, తాగునీటి సమస్య ఏర్పడకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసరావు, రామకృష్ణారెడ్డి, నాగరాజు, మల్లేశ్, కమల్ ఉన్నారు.